టీపీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా డాక్టర్ రాజీవ్



సుల్తాన్‌బజార్: తెలంగాణ టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా డాక్టర్ ఎం.రాజీవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ ఈ నియామక ఉత్తర్వులను రాజీవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియమించిన మహేష్‌కుమార్ గౌడ్‌కు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లౌడ్ స్పీకర్లను పూర్తిగా నిషేధించాలి



అఫ్జల్‌గంజ్: శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు లౌడ్ స్పీకర్లను పూర్తిగా నిషేధించాలని బజరంగ్ సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు బజరంగ్ సేనా ఆధ్వర్యంలో వినతిప్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..నగరంలోని ఒక ప్రాంతానికి చెందిన ప్రార్థన స్థలాల వద్ద ప్రతి రోజు లౌడ్ స్పీకర్ల శబ్దంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. శబ్ద కాలుష్యం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవ, మనోజ్, కీర్తి అవస్తి, వీరందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా శనివారం గౌలిపురా డివిజన్‌లోని పలు ఆలయాల వద్ద కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అభివృద్ధి పనులను ప్రారంభించారు. గౌలిపురా బతుకమ్మ బావి వద్దనున్న పోచమ్మ ఆలయ ప్రాంగణంలో రూ.2.70 లక్షలతో నూతన పవర్ బోర్ పనులు, హరిజన బస్తీలో రూ.2.50 లక్షలతో, మఖ్దూంపురా రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద రూ.1.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. బీజేపీ సీనియర్ నాయకులు ఆదర్ల మహేశ్, కొడి సురేందర్, జి.రఘుకాంత్, కె.రాజ్ కుమార్, జీఎం జ్యోతి కుమార్, ఎస్.రవి, జి.వికాస్, గౌతమ్, నర్సింగ్, దేవేందర్, గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న ప్రమోద్‌కుమార్, మోహన్‌గౌడ్, నరహరి

జియాగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం బేగంబజార్‌లో ఏర్పాటైన సన్మాన కార్యక్రమానికి రాంచందర్‌రావు హాజరు కాగా గోషామహల్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు ఆయనకు సన్మానించారు. సీనియర్ నాయకులు గోపిశెట్టి ప్రమోద్‌కుమార్, మోహన్‌గౌడ్, డి.నరహరి, ఎ.వెంకటేష్ గౌడ్, రాజేందర్ డేగాన్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ శంకర్‌యాదవ్

అబిడ్స్: గౌలిగూడ విఠోభ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. శనివారం జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బోయిని వెంకటేష్ యాదవ్, మాణిక్ ప్రభు, రాంచంద్ర, సంగం తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల సత్తా



అఫ్జల్‌గంజ్: సిప్ అబాకస్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అబాక్ పోటీల్లో దిల్‌సుఖ్‌నగర్ సిప్ అబాకస్‌కు చెందిన 40 మంది విద్యార్థులు ప్రతిభచాటారని ఆ సంస్థ నిర్వాహకులు మాధవి పేర్కొన్నారు. ఇటీవల శంషాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో తమ సంస్థకు చెందిన విద్యార్థులు శౌర్య, సహర్ష్ విజేతలుగా నిలిచారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సంస్థ విద్యార్థులు రాణించే విధంగా వారిని తీర్చిదిద్దుతున్నట్లు ఆమె వెల్లడించారు.

ఘట స్థాపన ఊరేగింపునకు సర్వం సిద్ధం

- నేడు పాతబస్తీలో సామూహిక ఘటస్థాపన ఊరేగింపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ
- లాల్‌దర్వాజ మోడ్ వద్ద స్వాగత వేదిక
- ఉజ్జయినీ బోనాలప్పుడే పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన ఊరేగింపు



శాలిబండలోని కాశీవిశ్వనాథ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు



మీరాలంమండిలో శుక్రవారం రాత్రి జరిగిన ఘట స్థాపన ఊరేగింపు

చార్మినార్: పాతబస్తీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసింది. పాతబస్తీ ప్రధాన సామూహిక ఊరేగింపునకు రెండు రోజుల ముందుగా..అంటే శుక్రవారం రాత్రి మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మాతేశ్వరి ఘట స్థాపన ఊరేగింపు కొనసాగింది. ఇక ఆదివారం పాతబస్తీలోని 22 ఆలయాలకు చెందిన అమ్మవారి ఘటాల ప్రతిష్టాపన ప్రధాన ఊరేగింపు జరుగనుంది. ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో బోనాల జాతర రోజే..పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపును ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల సౌకర్యార్థం ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఊరేగింపు బయలుదేరడానికి ఉత్సవాల నిర్వాహకులు సిద్ధమయ్యారు.

కాశీ విశ్వనాథ ఆలయం నుంచి..

శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటుంది. లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదిక పైనుంచి పలువురు ప్రముఖులు ఘటాలకు స్వాగతం పలుకుతారని ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజ్యసభ సభ్యులు ఎం.అనీల్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకనున్నారన్నారు.

అమ్మవారి ఘటాలు ఇవే..

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఘటం, ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఘటం, గౌలిపురా మహంకాళి మాతేశ్వరీ అమ్మవారి ఘటం, సుల్తాన్‌షాహి జగదాంబ మహంకాళి అమ్మవారి ఘటం, మురాద్‌మహల్ మహంకాళి అమ్మవారి ఘటం, సుల్తాన్‌షాహి బంగారు మైసమ్మ అమ్మవారి ఘటం, గౌలిపురా నల్ల పోచమ్మ అమ్మవారి ఘటం, రాంబక్షి బండ అమ్మవారి ఘటం, బేలా ముత్యాలమ్మ అమ్మవారి ఘటం, హరిబౌలి బంగారు మైసమ్మ అమ్మవారి ఘటం, హరిబౌలి అక్కన్నమాదన్న అమ్మవారి ఘటం, రాంసింగ్‌బడా బంగారు మైసమ్మ మహంకాళి ఘటం, మఖ్దూంపురా ఎల్లమ్మ అమ్మవారి ఘటం, సుల్తాన్‌షాహి రేణుకా ఎల్లమ్మ ఘటం, గౌలిపురా బంగారు మైసమ్మ ఘటం, మేకలబండ నల్లపోచమ్మ, మీర్‌చౌక్ బంగారు మైసమ్మ ఆలయాలకు చెందిన 22 అమ్మవారి ఘటాలు భక్తుల కోలాహలం నడుమ ముందుకు కదలనున్నాయి.

20న అమ్మవారికి బోనాల సమర్పణ..

పాతబస్తీలోని ప్రధాన ఆలయాల అమ్మవారి ఘట స్థాపన ఉత్సవాల అనంతరం ఈ నెల 20న అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. 18న విజయవాడ కనక దుర్గమ్మ తల్లి దేవస్థానం నుంచి పాతబస్తీలోని ప్రధాన అమ్మవారి ఆలయాలకు పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, చలివిడి సమర్పించనున్నారు. ఆలయ ఈఓ సీనా నాయక్ ఆధ్వర్యంలోని వేద పండితులు పాతబస్తీకి రానున్నారు. ఇక బోనాల సమర్పణ అనంతరం 21న పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించనున్నారు. ఊరేగింపు అనంతరం మరుసటి రోజు అమ్మవారికి సమర్పించే మారుబోనంతో పాతబస్తీలో ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ముగియనున్నాయి.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయం చరిత్రాత్మకం



పులిపాటి రాజేష్ కుమార్

చార్మినార్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోదం తెలపడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. తెలంగాణ క్యాబినెట్ ప్రస్తుతం తీసుకున్న నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్ద ఎత్తున మేలు కలుగుతుందన్నారు. రాజకీయంగా బీసీలు ముందడుగు వేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఆమోదం తెలిపినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌లతో పాటు మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న వర్కల నాగరాజు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు చేపడుతున్న ఘనత మజ్లిస్‌కే దక్కుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు వర్కల నాగరాజు అన్నారు. డివిజన్‌లోని శివాజీనగర్‌లో రూ.6.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్, మాజీ కార్పొరేటర్ సమద్ అబ్దాద్ చొరవతో డివిజన్‌లోని అన్ని బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుద్దీపాలు, నాలా విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు, శ్రీధర్, నందూ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న రాకేష్ తివారీ

చార్మినార్: విద్యార్థుల కాలాన్ని వృథా చేసుకోకుండా ఉన్నత విద్యాభ్యాసం వైపు పరుగులు తీయాలని దక్షిణ భారత్ కన్య కుబ్జ్ సభ అధ్యక్షుడు రామ్ కుమార్ తివారీ అన్నారు. అంబికానగర్‌లోని దక్షిణ భారత్ కన్య కుబ్జ్ సభ ప్రాంగణంలో శనివారం కేజీ టు పీజీ విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్‌తో పాటు బ్యాగులు, పెన్నులు, పెన్సిల్లు ఇతర స్టేషనరీ వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈరోజుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో వాట్సాప్ ఇతర సోషల్ మీడియాలకు ప్రేరేపితులవుతూ తమ విలువైన కాలాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. ఉపాధ్యక్షులు రాకేష్ తివారీ, కార్యదర్శి విజయ పాల్ పాండే, రాజేంద్రప్రసాద్ తివారీ, గోపాల్ ప్రసాద్ శుక్ల, విజయశంకర్ తివారీ, శోభ పాండే పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



క్లాస్ లీడర్లుగా ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ మేరి దివ్య

విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని షీ టీమ్, ఉమెన్స్ సేఫ్టీ వింగ్, భరోసా విభాగాల అధికారి డీసీపీ డాక్టర్ పి.లావణ్య అన్నారు. శనివారం విజయనగర్‌కాలనీ సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో క్లాస్ లీడర్లను ఎంపిక చేశారు. ఇన్వెస్టిచర్ సెర్మనీకి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై క్లాస్ లీడర్ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థినులు క్రమశిక్షణ, సేవాభావంతో నాయకత్వ స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ మేరి దివ్య మాట్లాడుతూ..క్లాస్ లీడర్లుగా ఎంపికైన విద్యార్థినులు సేవా దృక్పథం, బాధ్యత, ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే శక్తిని అలవర్చుకోవాలన్నారు. కరస్పాండెంట్ సిస్టర్ రోజీఫ్రాన్సిస్ ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కట్టమైసమ్మ మండల పూజ



లంగర్‌హౌస్: కట్టమైసమ్మ మండల పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. బుజిలీ మహంకాళి ఆలయ మాజీ చైర్మన్ బోగి పరమేష్ కుమార్ ఆధ్వర్యంలో లంగర్‌హౌస్ కట్టమైసమ్మ ఆలయాన్ని పునర్నిర్మించి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. అమ్మవారి పునఃప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా మండల పూజలు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. బోగి పరమేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, గోల్కొండ జగదాంబ ఆలయ పనివృత్తి వార్ల అధ్యక్షులు టి.శివశంకర్, వరదరాజ్, ఇంద్రసేనారెడ్డి, నాగేంద్ర ప్రకాష్‌రెడ్డి, పాండు కుమార్ పాల్గొన్నారు.

ఉజ్జయిని అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



లంగర్‌హౌస్: అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సస్యశామలంగా విరాజిల్లుతుందని గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ చంటిబాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో జగదాంబిక అమ్మవారి తరపున ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి చంటి బాబు, రాధా దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోట నీలిమ, కామేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజల్లో కమిటీ సభ్యులు నాగులపల్లి శ్రీకాంత్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు శాకంబరిగా అమ్మవారు..

లంగర్‌హౌస్‌లో చంటిబాబు మాటాడుతూ.. జగదాంబిక బోనాల ఉత్సవాల్లో భాగంగా నేడు అమ్మవారికి 6వ పూజ నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి శాకంబరి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థులకు ఉన్నత విలువలు నేర్పించాలి



విద్యార్థులతో 9వ నిజాం ప్రిన్స్ మీర్ అజ్మత్ అలీ ఖాన్

చార్మినార్: విద్యార్థులకు చదువుతో పాటు ఉన్నత విలువలను నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని 9వ నిజాం ప్రిన్స్ మీర్ అజ్మత్ అలీ ఖాన్ అన్నారు. శనివారం పురానీహవేలిలోని ముఖర్రం జా స్కూల్‌లో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం కార్యక్రమంలో 9వ నిజాంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖర్రం జా స్కూల్‌లో చదివిన విద్యార్థులు ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం ట్రస్ట్ సభ్యులు నవాజ్ ఫైజ్ ఖాన్, నవాజ్ ఫైజ్ బిన్ జంగ్, ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ అల్తాఫ్

డబీర్‌పురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..చంచల్‌గూడ దుల్హే ఖాన్ దేవిడి ప్రాంతానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ (40) సైదాబాద్‌లోని బిస్కెట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నెల 7న అల్తాఫ్ జీతం తీసుకోవడానికి ఆఫీస్‌కు వెళుతున్నానని ఇంట్లోలో చెప్పి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. అల్తాఫ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అబిడ్స్: గోషామహల్‌లోని ప్రభుత్వ పాఠశాల 1975వ సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత ఆ నాటి బాల్య స్మృతులు, స్నేహితుల భావాలు ఒకరికొకరు పంచుకొని సంబరపడ్డారు. శనివారం అదే పాఠశాల పూర్వ విద్యార్థులు అడిషనల్ ఎస్పీ రిటైర్డ్ కె.మధుతో పాటు అప్పటి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించి సంబరాల్లో మునిగారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..50 ఏళ్ల తర్వాత పలు విభాగాల్లో పదవీ విరమణ పొందిన ఆ నాటి పాత మిత్రులను ఒకే వేదికలో కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాధారాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



నేడు నల్లపోచమ్మకు తొలి బోనం

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ఈ నెల 13న ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా అమ్మవారికి తొలిబోనం సమర్పించనున్నట్లు నిర్వాహకులు, టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ తెలిపారు. ఏటా మాదిరిగానే ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాలు స్వీకరించి అమ్మవారికి కృపకు పాత్రులు కావాలన్నారు.

17న కళాకృష్ణ, ఉమా మహేశ్వరీ దంపతులకు పురస్కారం ప్రదానం



కళాకృష్ణ, ఉమా మహేశ్వరీ దంపతులు

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 17, 18వ తేదీల్లో యాదాద్రి అఖిల భారత డ్యాన్స్ ఫెస్టివల్–2025 వేడుకలను రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు కళాకృతి నృత్యాలయ డైరెక్టర్ ఎం.భారతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత ఉమామహేశ్వరీ, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ దంపతులకు యాదాద్రి జీవిత సాఫల్య పురస్కారం, కథక్ నృత్య నిపుణులు రాజేంద్ర గంగానికి యాదాద్రి ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నిత్యానందరావు, సాంస్కృతిక శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతీమణి మల్లు నందిని, విశ్రాంత ఐఏఎస్ అధికారి వీఎన్.విష్ణుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలియజేశారు.

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



అల్లం భాస్కర్‌ను ఆహ్వానిస్తున్న కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్‌కు శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాకెల్లి సర్వేశ్ కుమార్, అధ్యక్షుడు కాలే శ్రీనివాస్, జి.కృష్ణ, ధరమ్‌కార్ నవీన్, దుర్గేశ్, ప్రధాన అర్చకులు విష్ణు చారి పాల్గొన్నారు.

వైద్య సేవలకు కేంద్రంగా హైదరాబాద్



డాక్టర్ అక్బర్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: వైద్య సేవలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని మజ్లిస్ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం ఆయన షేక్‌పేట్‌లోని గెలాక్సీ రోడ్డులో డాక్టర్ అక్బర్ సూపర్‌స్పెషాలిటీ ఐ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత దశాబ్ద కాలంలో హైదరాబాద్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందించే ఆసుపత్రులు ఏర్పాటు అవుతూ వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్తాఫ్ అక్బర్, డాక్టర్ అక్బర్, డాక్టర్ నాజీయా అఫ్రోజ్ తదితరులున్నారు. నగరంలో ఇది తమ నాలుగో ఆసుపత్రి అని డాక్టర్ అక్బర్ తెలిపారు.

తలసానికి ఆహ్వానం



మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానిస్తున్న గాజుల అంజయ్య

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో జరిగే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య కోరారు. ఈ మేరకు శనివారం ఆయనను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈనెల 20న జరిగే బోనాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ సానుకూలంగా స్పందించి తప్పనిసరిగా ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీర్వాదం పొందుతానని హామీ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ నాయకులు మల్యాల మధుసూదన్ యాదవ్, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు అనంతోజ్ హన్స్ రాజ్, మాజీ అధ్యక్షుడు రాజేష్ తదితరులు ఉన్నారు.

బోనాల ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరింపజేస్తున్న కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురాలోని నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన చేతుల మీదుగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ఆహ్వానానికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ అమ్మవారి దర్శనానికి వస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, కమిటీ ప్రతినిధులు దేవేందర్, పుప్పాల మధుసూదన్ రావు, ఎల్.రాజేశ్, కొడి సురేందర్, డొంకి యాదగిరి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు ఠాకూర్ జగత్‌సింగ్ మృతి



ఠాకూర్ జగత్ సింగ్(ఫైల్)

గోల్కొండ: ప్రముఖ సంఘ సేవకుడు, సీనియర్ బీజేపీ నాయకుడు కార్వాన్‌కు చెందిన ఠాకూర్ జగత్ సింగ్ శనివారం ఉదయం మృతి చెందారు. బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ సోదరుడు ఠాకూర్ జగత్‌సింగ్ కార్వాన్‌లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆదరణ పొందారు. కార్వాన్ మహంకాళి మైసమ్మ ఆలయ చైర్మన్‌గా కూడా ఆయన ఎన్నో సేవలు చేశారు. ఆయన మృతి పట్ల కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం కార్వాన్‌లోని గణేష్ ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. కార్వాన్ మర్చంట్ అసోసియేషన్ వారు సంతాప సూచనగా శనివారం తమ షాపులను మూసివేశారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: ఆషాఢ మాసం సందర్భంగా గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి దర్శనానికి భక్తులు శనివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు కోటలోని నగీనాబాగ్‌లో ఉన్న నాగదేవతకు పూజలు నిర్వహించిన అనంతరం కోటపై కొలువుదీరిన అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273